సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 25 । మే । 2024



సెలవులు సద్వినియోగమయ్యేలా..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. 8లో ▸



ధర్మ పరిరక్షణతోనే మనుగడ

హిందూ ధర్మ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని పండితులు అన్నారు. చిన వెంకన్న క్షేత్రంలో వేద సభను ఘనంగా నిర్వహించారు. 8లో ▸



బాస్కెట్‌బాల్‌లో జయకేతనం

అంతర జిల్లాల యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. బాలికల జట్టు తృతీయ స్థానం సాధించింది. 8లో ▸

న్యూస్‌రీల్

ఆచంటలో భారీ వర్షం



జలమయమైన రోడ్లు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత కనిపించగా మధ్యాహ్నం 3 గంటలకు వాతావరణం ఒక్కసారిగా మారింది. పెనుగొండ, ఆచంట మండలాల్లో భారీ వర్షం కురిసింది. శివారు ప్రాంతాలతో పాటు ప్రధాన కూడళ్లలో రోడ్లు నీటమునిగాయి. వరి చేలల్లో ఉన్న పశుగ్రాసం వర్షం బారినపడింది.

టెన్త్ సప్లిమెంటరీకి 43 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కాగా తెలుగు పరీక్షకు 43.12 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. 2,887 మంది విద్యార్థులకు 1,245 మంది హాజరయ్యారయ్యారన్నారు. 29 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదుకాలేదని చెప్పారు.

సందేశాత్మకంగా నాటిక పోటీలు



బాలల నాటికలో ఓ సన్నివేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 31వ ఉగాది నాటికల పోటీలు సందేశాత్మకంగా సాగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఐదో రోజు ప్రదర్శించిన సంస్కార భారతి (షాద్‌నగర్) కళాకారుల బాలల నాటిక 'మాకు స్వాతంత్ర్యం కావాలి' ఆకట్టుకుంది. అనంతరం తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రం వారిచే పౌరాణిక పద్య నాటకం సీతా పరిత్యాగం ప్రదర్శించారు. విశ్రాంత హెడ్ మాస్టార్ కాకోజు రంగనాథంకు జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, పైలు శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

భీమవరం: జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఆర్ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు శుక్రవారం తెలిపారు. తొలిరోజు 91 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారయ్యారన్నారు. ఫస్టియర్ పరీక్షలకు జనరల్ విద్యార్థులు 3,095 మందికి 2,861 మంది, ఒకేషనల్ విద్యార్థులు 214 మందికి 173 మంది హాజరయ్యారన్నారు. సెకండియర్ పరీక్షలకు 86 శాతం హాజరు నమోదైందని, జనరల్ విద్యార్థులు 289 మందికి 241 మంది, ఒకేషన్ విద్యార్థులు 143 మందికి 131 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

కాళ్లకూరులో శ్రీచక్రస్నానం



కాళ్ల: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీచక్రస్నాన ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా మహా పూర్ణాహుతి నిర్వహించారు. పద్మావతి సరోవరంలో స్వామి, అమ్మవార్లకు వసంతోత్సవం, శ్రీచక్రస్నానం వేడుకలు జరిగాయి. ధ్వజ అవరోహణ, చోరోత్సవం, అశ్వ వాహన సేవ గ్రామోత్సవం నిర్వహించారు.

27 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

పెంటపాడు: పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఈనెల 27 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు జిల్లా పాలిసెట్ కో–ఆర్డినేటర్, గూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.ఫణీంద్రప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 3 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని, ఈనెల 31 నుంచి వచ్చేనెల 5 వరకు వెబ్ ఆప్షన్‌లు ఇచ్చుకోవచ్చన్నారు. జూన్ 7న సీట్లు కేటాయిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 90102 22178, 96761 97393 నంబర్లలో సంప్రదించాలని కోరారు. భీమవరం సీతా పాలిటెక్నిక్, తణుకు ఎస్ఎంవీ పాలిటెక్నిక్ కళాశాల, గూడెం నిట్ సమీపంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు.

అధిక దిగుబడులే లక్ష్యం

ఖరీఫ్.. రిలీఫ్

- 2.32 లక్షల ఎకరాల్లో సాగు
- 5.74 లక్షల టన్నుల దిగుబడి లక్ష్యం
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- భూసార పరీక్షలకు సన్నాహాలు
- డ్రెయిన్లలో పూడికతీతకు చర్యలు
- ఖరీఫ్‌కు అధికారుల సన్నద్ధత



భీమవరం కలెక్టరేట్‌లో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, భీమవరం: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జిల్లాలోని 2.32 లక్షల ఎకరాల్లో సాగు జరుగనుండగా 5.74 లక్షల టన్నుల దిగుబడి లక్ష్యంగా అడుగులు వేస్తోంది. తక్కువ దిగుబడినిచ్చే పంట పొలాలను గుర్తించి భూసార పరీక్షల నిర్వహణకు సన్నద్ధమవుతోంది. మరోపక్క సాగు సజావుగా సాగేలా డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు చేపట్టారు.

నారుమడులు సిద్ధం

జిల్లాలో ముందుగా వరికోతలు పూర్తయిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, ఆకివీడు తదితర మండలాల్లో రైతులు ఇప్పటికే నారుమడులు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. మరోపక్క సాగు ఆలస్యమైన ఆచంట, పాలకొల్లు, కాళ్ల, పోడూరు, వీరవాసరం, పెనుమంత్ర, నరసాపురం రూరల్, భీమవరం తదితర ప్రాంతాల్లో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

ముమ్మరంగా భూసార పరీక్షలు : 2023–24 సీజన్‌కుగాను 15,032 మట్టి నమూనాల సేకరణ లక్ష్యంగా నిర్ణయించగా, గత ఖరీఫ్‌లో ఆర్‌బీకేల ద్వారా 10,316 మట్టి నమూనాలను సేకరించి తాడేపల్లిగూడెం సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపారు. నెలాఖరుకు మిగిలిన 4,716 మట్టి నమూనాలను సేకరించేందుకు వ్యవసాయాధికారులు ముమ్మరంగా భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

సబ్సిడీపై విత్తనాలు

తొలకరికి 48,463 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా అధికారులు కొరత లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎంటీయూ 1318, 7029, 1061, 1064 రకాలతో పాటు స్పందన స్వర్ణ, పీఆర్ 126 వరి వంగడాలు అందుబాటులో ఉంచారు. వంద క్వింటాళ్ల వరకు విత్తనాలను కిలో రూ.5 చొప్పున సబ్సిడీపై పంపిణీకి సిద్ధం చేశారు.

58 వేల టన్నుల ఎరువులు

ఖరీఫ్ సీజన్‌లో 21,272 టన్నుల యూరియా, 23,464 టన్నుల కాంప్లెక్స్, 2,391 టన్నుల డీఏపీ, 6,391 టన్నుల ఎస్ఎస్‌పీ, 5,387 టన్నుల ఎంఓపీలతో మొత్తం 58,905 టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా. ఇప్పటికే మార్క్‌ఫెడ్ వద్ద 3,008 టన్నులు, హోల్‌సేల్ డీలర్ల వద్ద 29,293 టన్నులు, రిటైలర్ల వద్ద 11,446 టన్నులు కలిపి మొత్తం 45,324 టన్నులు, మండలాల వారీగా రైతు భరోసా కేంద్రాల్లో 1,488 టన్నుల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచారు. మరోపక్క పంట రుణాలు రూ.4,179 కోట్లు, టర్మ్ లోన్స్ రూ.3,116 కోట్లు మంజూరుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.

మేలైన రకాలు సాగు చేయాలి

రాబడి, స్థానికంగా వినియోగించే మేలైన వంగడాల సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్‌లో శుక్రవారం ఖరీఫ్–2024 సన్నద్ధతపై వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులతో వర్క్‌షాప్ నిర్వహించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంట తెగుళ్లు, వైపరీత్యాలను ఎదురొడ్డి నిలిచే ఆధునిక వంగడాలను సాగు చేయించాలన్నారు. తక్కువ దిగుబడి వస్తున్న పంట పొలాల రైతులకు అవగాహన కలిగించి భూసార పరీక్షలు చేయాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాజా డ్రెయిన్, నందమూరు అక్విడెక్ట్ వద్ద పూడికతీత పనులకు చర్యలు చేపట్టామన్నారు. గునుపూడి సౌత్, మొగల్తూరు డ్రెయిన్లలో తూడు వలన నీటిపారుదలకు ఆటంకం కలిగి పంట పొలాలు ముంపు గురవుతున్నాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2023–24కి జిల్లాలో 84,185 సీసీఆర్ కార్డుల లక్ష్యం కాగా 90,053 కార్డులు అందజేశామని తెలిపారు. డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు, రైతు కార్య సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీరాజు, ఉండి కేవీకే, మార్టేరు వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, నీటిపారుదలశాఖ, మండల వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

401 ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం కృషి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



అతిరాత్ర మహాయాగం వేదికపై మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

భీమవరం(ప్రకాశంచౌక్): రాష్ట్రంలో 401 ఆలయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న అతిరాత్ర మహాయాగ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ విషయంలో బాధ్యత తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. అతిరాత్ర మహాయాగం ఇంత అద్భుతంగా నిర్వహించిన జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యశర్మను, సహకరించిన వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో యజ్ఞకర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ, కర్ణాటక రుత్వికులు కేశవ స్వామియాజీ, విశ్వనాథ శర్మలను సత్కరించారు. గజల్ శ్రీనివాస్, కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, నడింపల్లి బంగారాజు, నరహరిశెట్టి కృష్ణ, ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు తదితరులు పాల్గొన్నారు.

డీవైఈఓ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

డీఆర్వో ఉదయ భాస్కరరావు



సమీక్షిస్తున్న డీఆర్వో ఉదయ భాస్కరరావు

భీమవరం: జిల్లాలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈఓ) పోస్టుల భర్తీకి స్క్రీనింగ్ పరీక్షలు శనివారం జరుగనున్నాయని, ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయినట్టు డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన ఏపీపీఎస్సీ అధికారులు, జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆరు కేంద్రాల్లో 840 అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. భీమవరం డీఎన్నార్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీలో 130, భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 100, భీమవరం దంతులూరు నారాయణరాజు (అటానమస్) కాలేజీలో 100, నరసాపురం స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 100, తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కాలేజీలో 250, తాడేపల్లిగూడెం శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్‌లో 160 మంది హాజరుకానున్నారన్నారు. కంప్యూటరు ఆధారిత పరీక్షలు ఉదయం 9 గంటలు నుంచి 11.30 గంటల వరకు జరుగుతాయని, అభ్యర్థులు ఉదయం 8.30 గంటలలోపు కేంద్రాల్లోకి చేరుకోవాలన్నారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, లైజన్ ఆఫీసర్ చొప్పున నియమించామన్నారు. కేంద్రాల్లోకి అభ్యర్థులు సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలకు తీసుకు రాకూడదన్నారు. కేంద్రాల వద్ద పక్కా ఏర్పాట్లు చేశామన్నారు. ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు గిరిజ, అమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతావాణి, లైజనింగ్ అధికారులు, కాలేజ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రైతులకు ఆమోదయోగ్యమైన పరిష్కారం

కలెక్టర్ సుమిత్‌కుమార్



రైతులు, ఓఎన్జీసీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): ఓఎన్జీసీ పైపులైన్ వెళ్తున్న యర్రంశెట్టివారిపాలెం రైతులకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని చూపించామని, రైతుల అంగీకారంతో పైప్‌లైన్ నిర్మాణం కొనసాగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సీతారామపురం సౌత్, యర్రంశెట్టి వారిపాలెం, రుస్తుంబాద గ్రామాల రైతులు, ఓఎన్జీసీ అధికారులతో ఆయన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఆమోదయోగ్యంగా పరిష్కారం చూపించామన్నారు. ఇప్పటికే యర్రంశెట్టివారిపాలెంలో పైపులైన్లు వెళ్తున్న మార్గంలో రోడ్డుకి ఆనుకుని ఉన్న భూములను సర్వే చేయించి వాస్తవ హక్కుదారులు 70 మందిని గుర్తించామన్నారు. వీరికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.35 లక్షలు ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధుల నుంచి చెల్లించడానికి ఆ సంస్థ అంగీకరించిందన్నారు. అలాగే పైప్‌లైన్లు వెళ్లే మూడు గ్రామాలకు ఒక్కో గ్రామానికి రూ.15 లక్షల చొప్పున మొత్తం రూ.45 లక్షలు ఆయా గ్రామాల అభివృద్ధికి ఓఎన్జీసీ నిధులు మంజూరు చేసిందన్నారు. పైపులైన్లు వెళ్లే మార్గంలో భూముల క్రయవిక్రయాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. వైఎస్ పాలెం సర్పంచ్ యర్రంశెట్టి బాబులు, రైతు ప్రతినిధులు యర్రంశెట్టి హరికృష్ణ తదితరులు రోడ్డుకు అవతలి వైపున ఉన్న 44 మంది రైతులతో కలిపి మొత్తం 114 మందికి పరిహారాన్ని అందించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నిబంధనల మేరకు ఇది సాధ్యం కాదని, 70 మంది రైతులకు మాత్రమే పరిహారాన్ని అందిస్తారని స్పష్టం చేశారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, నరసాపురం ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, నరసాపురం డీఎస్పీ శ్రీనివాసరావు, ఓఎన్జీసీ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) జాన్ వెస్లీ, జనరల్ మేనేజర్ (ప్రాజెక్టు) శ్యామ్‌రాజ్, జిల్లా సర్వే అధికారి కె.జాషువా తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీచక్రస్నానం

నేటితో ముగియనున్న చినవెంకన్న బ్రహ్మోత్సవాలు



శ్రీ చక్రస్నానం వేడుక జరిపిస్తున్న అర్చకులు



అశ్వవాహనంపై ఊరేగింపు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీచక్ర స్నానం వేడుకను నేత్రపర్వంగా జరిపించారు. ముందుగా అర్చకులు ఆలయ యాగశాలలో శ్రీవారు, అమ్మవార్లు, శ్రీచక్ర పెరుమాళ్ల ఉత్సవ మూర్తులను వేదికపై వేంచేపు చేశారు. పూజాదికాల అనంతరం సుగంధ ద్రవ్యాలు, పంచ పల్లవులు, శ్రీచందనం, పసుపు, మంత్రపూత అభిషేక తీర్థంతో శ్రీచక్ర స్వామిని అభిషేకించారు. అనంతరం శ్రీచక్ర పెరుమాళ్లతో పాటు ఉభయ నాంచారులకు, శ్రీవారికి తిరుమంజనాలు జరిపి హారతులిచ్చారు. అభిషేక జలాన్ని భక్తుల శిరస్సులపై చల్లారు. సాయంత్రం ఆలయంలో నిత్య హోమ బలిహరణలు, పూర్ణాహుతి, అనంతరం ధ్వజ అవరోహణ వేడుకలను అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో వైభవోపేతంగా జరిపారు. ఆలయ ముఖ మండపంలో శ్రీవారి మురళీకృష్ణ అలంకారం భక్తులకు కనువిందు చేసింది. రాత్రి స్వామి వారికి అశ్వవాహనంపై తిరువీధి సేవను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శనివారం రాత్రి జరిగే శ్రీపుష్ప యాగోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని, ఆదివారం నుంచి ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను పునరుద్ధరిస్తామని దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి భజనలు
- ఉదయం 9 గంటల నుంచి శ్రీవారికి చూర్ణోత్సవం, వసంతోత్సవం
- ఉదయం 10 గంటల నుంచి భక్తిగీతాలు ఆలాపన
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వరకచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగం–పవళింపు సేవ

రాత్రి 9 గంటల నుంచి – నాటక ప్రదర్శన

ప్రత్యేక అలంకారం : శయన మహావిష్ణువు

పారిశుద్ధ్య నిర్వహణలో సిద్ధాపురం భేష్

ఆకివీడు: తడి, పొడి చెత్త సేకరణ, ఉప ఉత్పత్తుల తయారీలో సిద్ధాపురం విజయవంతంగా ముందుకు సాగుతుందని కేంద్ర భారత్ దర్శన్ బృందం కితాబిచ్చింది. శుక్రవారం బృంద సభ్యులు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో చేపట్టిన స్వచ్ఛభారత్ పనులను సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు వారికి వివరించగా ఆయన్ను ఢిల్లీ తీసుకువెళతామని కేంద్ర బృంద ప్రతినిధి అభిషేక్ డెబ్జిత్ అన్నారు. గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారీ, డ్రై వేస్ట్ అమ్మకం, ఆదాయం, సేంద్రీయ ఎరువుల తయారీ, అమ్మకం తదితర వివరాలను కేంద్ర బృందం తెలుసుకుంది. కేంద్ర బృందం పర్యటనపై డీపీఓ ఆర్.విక్టర్ మాట్లాడుతూ ఐదు రోజులుగా జిల్లాలోని పది మండలాల్లో 10 గ్రామాల్లో భారత్ దర్శన్ కార్యక్రమాల పనితీరును వీరు పరిశీలించారన్నారు. సిద్ధాపురంలో పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, ఈడీవార్డు రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

ఉండి: ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అన్ని పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలని జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. స్ట్రాంగ్ రూమ్ భద్రత, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై నియోజవర్గ అభ్యర్థులు, ఏజెంట్లతో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కాలేజీలో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఈనెల 31లోపు కౌంటింగ్ ఏంజెంట్ల వివరాలు అందించాలని సూచించారు. ఏజెంట్లు కేంద్రాల వద్దకు ఉదయం 6.30 గంటలకు చేరుకోవాలన్నారు.

వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే..

- పందేలకు సై.. సై..
- పెరుగుతున్న బెట్టింగ్‌లు
- పత్తాలేని కూటమి సానుభూతిపరులు

తాడేపల్లిగూడెం/తణుకు: రాష్ట్రంలో వచ్చేది.. సంక్షేమ పాలన ఇచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అంటూ జిల్లాలో బెట్టింగులు జోరందుకున్నాయి. పోలింగ్ ముగిసిన రోజున డాంబికాలు పోయి, హంగామా సృష్టించిన కూటమి నేతలకు భంగపాటు తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో కూటమి గెలుస్తుందని కోసు పందాలు, ఒకటికి రెండు, ఒకటికి మూడు, ఐదు అంటూ హైప్ క్రియేట్ చేసిన వారంతా వారం రోజులుగా పత్తాలేకుండా పోయారు. తాజా పరిణామాలు, పోలింగ్ విశ్లేషణలు బయటకు వచ్చిన తర్వాత బెట్టింగ్‌రాయుళ్ల హడావుడి తగ్గింది. వైఎస్సార్‌సీపీ మరలా అధికారం చేపడుతుందని చాలెంజ్ చేస్తే.. కూటమి అభిమానులు, పందాలరాయుళ్లు పత్తాలేకుండా పోతున్నారు. రాయలసీమ, కడప ప్రాంతాల నుంచి వచ్చిన వారు వైఎస్సార్‌సీపీ వైపు సవాల్‌కు సై అంటున్నా పందాలు కాచే వారు కానరాని పరిస్థితి జిల్లాలో కనిపిస్తోంది. చంద్రబాబు సొంత సామాజికవర్గం సిండికేట్‌గా మారి బెట్టింగ్‌లు వేసే వాతావరణం జిల్లాలో వేళ్లానుకుంది. ఐదేళ్లుగా సంక్షేమ పాలనను అన్నివర్గాలకు చేరువ చేసిన జగనన్న ప్రభుత్వానికి తిరిగి పట్టం కట్టేలా పోలింగ్ సరళి ఉందన్నది సర్వేలు, విశ్లేషణల సారాంశం. కూటమికి ఓటేసిన వారు రోడ్లెక్కి హల్‌చల్ చేస్తున్నట్టుగా వాతావరణం ఉండగా.. ఫ్యాన్‌కు ఓటేసిన వారు నిశ్శబ్ద విప్లవాన్ని మరోసారి తెచ్చేలా సైలెంట్‌గా ఉన్నారని, పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలు, అర్ధరాత్రి వరకు సాగిన పోలింగ్ సరళి ఇందుకు నిదర్శనం అని అంటున్నారు. అధికార పార్టీకి ఓటేసిన వారు సైలెంట్‌గా ఉండగా, కూటమికి ఓటేసిన వారు హంగామాతో పందాలను చేజిక్కించుకొని లబ్ధి పొందాలని చూస్తున్న వాతావరణం జిల్లాలో నెలకొంది.

రెండు రోజులుగా మారిన పరిస్థితి

2019 ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం ఫలితాలపై బెట్టింగ్‌లు వేయడానికి చాలా మంది జంకుతున్నారు. నియోజకవర్గంలోని స్థానిక పరిస్థితులు, పోలింగ్ సరళి, తాయిలాల పంపిణీలను ఆధారంగా చేసుకుని నియోజకవర్గ ఫలితం, గ్రామాల వారీ ఆధిక్యతలు, వార్డుల్లో బూత్‌ల వారీ ఆధిక్యాలు ఎలా ఉంటాయనే స్థాయిలోనే పందాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మెజార్టీపై పందాల కంటే సీటు పందాలు, జిల్లాలో గెలిచే స్థానాలు, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఏర్పడుతుంది, ఎన్ని సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తారు, మేజిక్ ఫిగర్ దాటి ఎన్ని సీట్లు రావచ్చు అనే కోణంలో ప్రధానంగా పందాలు సాగుతున్నాయి. గతంలో మాదిరి ఆస్తులను పణంగా పెట్టి పందాలు వేసే వాతావరణం జిల్లాలో లేదు. పార్టీల సానుభూతిపరులుగా అభ్యర్థుల వెంట క్రియాశీలకంగా తిరిగిన వారు ఎక్కువగా బెట్టింగులు వేస్తున్నారు. రెండు రోజులుగా తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తుందనే కోణంలోనే ఎక్కువగా పందాలు జరుగుతున్నట్టు సమాచారం.

ఇతర నియోజకవర్గాలపైనా.. పందెం రాయుళ్ల హాట్ ఫేవరేట్‌గా పిఠాపురం నిలుస్తోంది. అక్కడ పోటీలో ఉన్న పవన్ కల్యాణ్, వంగా గీతలో ఎవరు గెలుస్తారు.. గెలిస్తే ఎంత మెజార్టీ వస్తుందన్న దానిపై పందెం కాస్తున్నారు. గత ఎన్నికల్లో భీమవరం, గాజువాకలో పోటీ చేసి పవన్ కల్యాణ్ ఓడిపోవడంతో ఈసారి గెలిచి అసెంబ్లీలో అడుగుపెడతారా? లేక అలవాటైన రీతిలో ఓడిపోతారా? అని ఆరా తీస్తున్నారు. మంగళగిరి, హిందూపురం, కుప్పం స్థానాలపైనా పందేలు నడుస్తున్నాయి. కుప్పంలో చంద్రబాబుకు మెజార్టీ తగ్గుతుందని పందెం కాయడానికి ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నట్లు పందెం రాయుళ్లు చెబుతున్నారు.

క్లుప్తంగా

గోదావరి నదిలో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి


సత్తార్ మృతదేహం

కొవ్వూరు: విజ్జేశ్వరం ఆనకట్ట వద్ద సరదాగా స్నేహితులతో గోదావరి నదిలో స్నానాలు చేస్తూ ప్రమాదవశాత్తు నీట మునిగి తాడేపల్లి గూడెం పట్టణానికి చెందిన ఎస్‌కే సత్తార్ (31) మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం ఎస్‌కే మదీన్‌షా, ఎస్‌కే అబ్దుల్ రెహమాన్‌లతో కలిసి సరదాగా విజ్జేశ్వరం ఆనకట్ట వద్దకు వచ్చారు. బ్యారేజీ దిగువన స్నానాలకు దిగారు. కాలు జారడంతో నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు రక్షించి ఒడ్డుకు చేర్చగా అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. రూరల్ ఎస్సై కె.సుధాకర్‌కి సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు తాడేపల్లిగూడెంలోని తొమ్మిదో వార్డు పరిధిలోని సాలిపేటకి చెందిన వాడని ఎస్సై తెలిపారు. పట్టణంలో మటన్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధి కూలీ మృతి


సత్యనారాయణ మృతదేహం

పెంటపాడు: అలంపురంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దువ్వకు చెందిన ఉపాధి కూలీ మృతి చెందాడు. పెంటపాడు ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం దువ్వకు చెందిన చిక్కాల సత్యనారాయణ (68) స్వగ్రామం నుంచి అలంపురం మోటార్ సైకిల్‌పై గూడెం వైపు వస్తుండగా అదే దారిలో వెనుక వస్తున్న కారు సత్యనారాయణను వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని కొత్తపేటలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి, ఐదుగురు వ్యక్తులపై దాడి చేసింది. దీంతో స్థానిక యువజనులు పిచ్చికుక్క వెంటపడి తరిమికొట్టి చంపేశారు. గెద్దాడ కిరణ్‌కుమార్, గొల్లమందుల యోబు, బద్దె వజ్రమ్మతో మరో ఇరువురు పిచ్చికుక్క కాట్లకు గురయ్యారు. వీరంతా పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్య చికిత్స పొందారు.

బ్యాంకులో గుండెపోటుతో మహిళ మృతి

తణుకు: పట్టణంలోని ఒక బ్యాంకుకు వచ్చిన మహిళ గుండె పోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ఆలపాటి లక్ష్మీ నారాయణమ్మ (55) తన భర్తతో కలిసి జిల్లా సహకార బ్యాంకు తణుకు బ్రాంచ్‌కి వచ్చారు. ఈ క్రమంలో బ్యాంకు ఆవరణలో కూర్చున్న లక్ష్మీనారాయణమ్మ గుండెపోటుతో కుప్పకూలిపోయింది.దీంతో ఆమె సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.


పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు


యోగాసనాలు వేస్తున్న చిన్నారులు


భీమవరంలో చెస్, క్యారమ్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సెలవులు సద్వినియోగమయ్యేలా..

- విద్యార్థులకు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు
- రోజూ ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు
- వచ్చే నెల 7వ తేదీ వరకు తరగతుల కొనసాగింపు
- ఉమ్మడి పశ్చిమలోని 74 గ్రంథాలయాల్లో నిర్వహణ


విద్యార్థులకు డ్యాన్స్ నేర్పిస్తున్న దృశ్యం

భీమవరం: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా.. విజ్ఞానం, క్రీడలపై కొంత సమయం కేటాయించేలా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా శాఖా గ్రంథాలయాల్లో ప్రత్యేక వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. గతంలో గ్రంథాలయాలు అంటే కేవలం పుస్తక పఠనానికి మాత్రమే పరిమితం కాగా ప్రస్తుతం విజ్ఞాన, వ్యక్తిత్వ వికాస కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. దీనిలో భాగంగానే విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణలు ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 74 శాఖా గ్రంథాలయాలు ఉండగా వాటన్నింటిలో ఈనెల 15 నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు విజ్ఞాన తరగతులు కొనసాగనున్నాయి. వాస్తవంగా వేసవి శిక్షణ తరగతులు ఏప్రిల్ 29న ప్రారంభం కావాల్సి ఉండగా, సార్వత్రిక ఎన్నికల కారణంగా ఈనెల 15న ప్రారంభమయ్యాయి. రోజూ ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తున్న విజ్ఞాన తరగతులకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు.

పలు అంశాల్లో శిక్షణ

వేసవిలో విద్యార్థులకు డ్యాన్స్, యోగా, చదరంగం, క్యారమ్స్ వంటి వాటిలో శిక్షణ ఇవ్వడంతో పాటు కథలు చెప్పడం, పుస్తక పఠనం ఎలా అనే అంశాలను నేర్పిస్తున్నారు. తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్, మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్నారు. అలాగే శిక్షణా తరగతులు సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నారు.

స్థానిక గురువుల సహకారంతో..

వేసవి శిక్షణా తరగతుల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఒక్కో గ్రంథాలయానికి సుమారు రూ.10 వేల వరకు అందిస్తుండగా వీటిని విద్యార్థులకు స్నాక్స్, మజ్జిగ ప్యాకెట్లు కొనుగోలు కోసం వెచ్చిస్తున్నారు. అలాగే పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడానికి స్థానికంగా ఆయా రంగాల్లో నిష్ణాతులైనవారి సహకారం తీసుకుంటున్నారు. చెస్, క్యారమ్స్, యోగా, డ్యాన్స్ వంటి వాటిలో అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉపాధ్యాయులు సహకారం కూడా తీసుకుంటున్నారు. వీరంతా ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

కోచ్‌ల సహకారంతో శిక్షణ



గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన తరగతులకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. ప్రతి ఏటా వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం. డ్యాన్స్, యోగా, చెస్, క్యారమ్స్ వంటి క్రీడల్లో శిక్షణ ఇవ్వడానికి స్థానికంగా కోచ్‌లు సహకరిస్తున్నారు. విజ్ఞాన తరగతుల ముగింపు సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తాం.

–ఎస్.వెంకటేశ్వరరావు, గ్రంథాలయాధికారి, భీమవరం

సెల్‌ఫోన్ ట్రాకింగ్ ద్వారా 150 సెల్‌ఫోన్ల రికవరీ


భీమవరంలో రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అందిస్తున్న ఎస్పీ అజిత

భీమవరం: జిల్లా పోలీసు కార్యాలయంలోని సెల్‌ఫోన్ ట్రాకింగ్ ద్వారా ఏడో విడతలో సుమారు రూ.22.50 లక్షల విలువైన 150 సెల్‌ఫోన్స్‌ను రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ వేజెండ్ల అజిత చెప్పారు. శుక్రవారం భీమవరం సెల్‌ఫోన్స్ పోగొట్టుకున్న బాధితులకు రికవరీ చేసిన ఫోన్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్ ట్రాకింగ్ సిస్టమ్స్‌కు ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 3,464 పిర్యాదులు అందగా వాటిలో మొదటి విడతలో 157, రెండవ విడతలో 105, మూడవ విడతలో 180 ఫోన్స్ రికవరీ చేసిన సెల్‌ఫోన్స్ అందజేశామన్నారు. అలాగే 4వ విడతలో 158, 5వ విడతలో 201, 6వ విడతలో 153 ఫోన్స్ అందించినట్లు అజిత వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,104 ఫోన్స్ రికవరీ చేయగా వాటి విలువ సుమారు రూ. 1.65 కోట్లు ఉంటుందన్నారు. సెల్‌ఫోన్స్ రికవరీకి పని చేస్తున్న దిశా డీఎస్పీ నున్న మురళీకృష్ణ, సెల్ ట్రాకింగ్ సిబ్బంది భాస్కర్, వి.సాయికృష్ణ, వీజీఎస్‌కుమార్, బి శ్రీనివాస్, కె పాపారావు, కె ప్రసాద్‌బాబులను ఎస్పీ అజిత అభినందించారు.

హిందూ ధర్మ పరిరక్షణతోనే మానవ మనుగడ


వేద సభలో వేదికపై స్వామి, అమ్మవార్లు


వేద సభను నిర్వహిస్తున్న పండితులు, ఆగమ విద్యార్థులు

ద్వారకాతిరుమల: హిందూ ధర్మ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అర్చకులు, పండితులు ఉద్బోధించారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ఆలయ అధికారులు, అర్చకులు, పండితులు శుక్రవారం సాయంత్రం వేద సభను ఘనంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం జరిగిన మరుసటి రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి తొళక్క వాహనంపై మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ నిత్యకల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. ఆ తరువాత కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై కల్యాణ మూర్తులను ఉంచి విశేష పుష్పాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు దంపతులు అందించిన వివిధ రకాల ఫలాలను, పుష్పాలను స్వామివారి ముందు ఉంచారు. శ్రీవారు, అమ్మవార్లు కొలువైన వేదిక ముందు అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆగమ విద్యార్థులు కొలువు తీరారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్ల గుణగణాలను కీర్తిస్తూ వేద మంత్రోచ్ఛరణలు జరిపారు. అనంతరం శ్రీవారు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు హారతులిచ్చి, నీరాజన మంత్రపుష్పాలను సమర్పించారు. ఆఖరిలో అర్చకులు, పండితులను ఆలయ ఈఓ త్రినాథరావు ఘనంగా సత్కరించారు.

రైతులను నిండా ముంచేసిన ధాన్యం వ్యాపారి

దాదాపు రూ.4 కోట్లు ఎగ్గొట్టాడని రైతుల ఆవేదన


ధాన్యం వ్యాపారి చంద్రశేఖర్ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నూజివీడు: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ధాన్యం వ్యాపారికి విక్రయించగా ఆ వ్యాపారి రైతులను నిండా ముంచేసి ఊరు నుంచి వెళ్లిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమకు న్యాయం ఎవరు చేస్తారని ఆవేదన చెందుతున్నారు. ధాన్యం వ్యాపారి ఇంటి వద్ద శుక్రవారం రైతులంతా కలిసి ఆందోళనకు దిగారు. నూజివీడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన మల్లూరు చంద్రశేఖర్, మల్లూరు సురేష్ అనే వ్యాపారులు ఇద్దరూ అన్నదమ్ములు. వీరిద్దరూ కలిసి అన్నవరం, ముక్కొల్లుపాడు, సుంకొల్లు, దిగవల్లి, ముసునూరు మండలం సూరేపల్లి గొల్లగూడెం, చాట్రాయి మండలం సోమవరం, తుమ్మగూడెం ప్రాంతాల్లో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేశారు. రైతుల వద్ద నుంచి గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యాన్ని డిసెంబరు, జనవరి నెలల్లో దాదాపు 400 మంది రైతుల వద్ద నుంచి ధాన్యంను కొనుగోలు చేశారు. అయితే అప్పటి నుంచి రైతులు తమకు రావాల్సిన డబ్బుల కోసం తిరుగుతుంటే వాయిదాలు పెడుతూ వచ్చి డబ్బులు ఇవ్వకుండా ఐదు నెలలు గడిపారు. రైతులకు దాదాపు రూ.4 కోట్ల పైన నగదు చెల్లించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ఈనెల 15న మల్లూరు చంద్రశేఖర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి తిరుపతి, కాణిపాకం వెళ్లి వస్తానంటూ అందరూ వెళ్లిపోయారు. ఈ విషయం తెలిసి రైతులు ఆయన ఇంటి వద్దకు వచ్చి అతని తమ్ముడైన సురేష్‌ను తమకు చెల్లించాల్సిన నగదు విషయమై అడుగుతుంటే తాను కేవలం లెక్కలు రాసేందుకు మాత్రమే ఉన్నానని, మా అన్నయ్య ఎవరికి ఎంత ఇవ్వాలో? తనకు తెలియదని పేర్కొన్నాడు. వారం రోజుల్లో వస్తానని వెళ్లాడని ఇంత వరకు రాలేదని పేర్కొంటున్నాడు. చంద్రశేఖర్ ఫోన్ నెంబరు స్విచ్ ఆఫ్ వస్తోందని, మరో నెంబరుకు ఫోన్ చేస్తే రింగ అవుతుంది గాని ఎవరూ ఎత్తడం లేదని రైతులు చెబుతున్నారు. ముసునూరు మండలం సూరేపల్లికి చెందిన ముల్లంగి సుధారాణి తాము కౌలుకు తీసుకొని పంట పండించి ధాన్యం కాటా వేయగా రూ.2 లక్షలు ఎగ్గొట్టి వెళ్లిపోయాడని, తాను పిల్ల పెళ్లి పెట్టుకున్నానని వాపోయింది. ఇలా పలువురు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ధాన్యం వ్యాపారిపై ఫిర్యాదు చేశారు.

అతిరాత్ర మహాయాగ తలంబ్రాలకు పూజలు


సిద్ధాంతంలో గోదావరి స్నానాలు చేస్తున్న భక్తులు

పెనుగొండ: భీమవరంలో నిర్వహిస్తున్న అతిరాత్ర యాగాల్లో భాగంగా సిద్ధాంతం కేదారీ ఘాట్‌లో అతిరాత్ర మహా యాగ తలంబ్రాలుకు గోదావరి జలంతో పూజాధికాలు నిర్వహించి, గోదావరిలో కలిపారు. శుక్రవారం భీమవరం పరిసర ప్రాంతాల నుంచి సుమారు 400 మంది గోదావరి స్నానాలు చేసి రుత్విక్కులు ఆశీర్వచనాలు పొందారు. అతిరాత్ర యాగంలో 10 రోజుల పాటు దీక్ష తీసుకున్న దంపతులు పండితుల ఆశీస్సులు పొందారు. కర్ణాటక నుంచి విచ్చేసిన రుత్వికులు సాకేత్ శర్మ, కేశవ్ శర్మజ్ యజ్ఞకర్త జంద్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ దంపతులు, యజ్ఞ పర్యవేక్షకులు చెరుకువాడ రంగసాయి దంపతులు పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తుల తరలిరావడంతో గోదావరి తీరం శివనామస్మరణతో మారుమోగింది. 25న పుత్రకామేష్టి యాగం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

ఉగాది జాతీయస్థాయి నాటికగా ఇంద్రప్రస్థం


అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటికలో సన్నివేశం

తాడేపల్లిగూడెం (టీఓఎస్): తాడేపల్లిగూడెం పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 31వ ఉగాది నాటికల పోటీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. బీవీఆర్ కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు నాటిక పోటీల విజేతల వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక నిలిచింది. ఉత్తమ ద్వితీయ నాటికగా విశాఖపట్నం తెలుగు కళా సమితి వారి నిశబ్దమా నీ ఖరీదెంత ? ఉత్తమ తృతీయ నాటికగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి రాత, జ్యూరీ ప్రదర్శనలుగా హైదరబాద్ సిరిమువ్వ కల్చరల్ థింక్, కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ వారి కౌసల్యా సుప్రజారామ, ఉత్తమ రచనలుగా ఇంద్రప్రస్థం, స్నిగ్ధ, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ నటుడిగా ఇంద్రప్రస్థం నాటికలో ఎన్.రవీంద్ర రెడ్డి, ఉత్తమ నటిగా అమృతహస్తంలోని మాలతి పాత్రలోని మాధవి, ద్వితీయ ఉత్తమ నటిగా స్వప్నం రాల్చిన అమృతంలో జ్యోతిరాణి (సుగుణ), ఉత్తమ ప్రతి నాయకుడిగా అమృతహస్తం నాటికలో ఏపూరి హరిబాబు, ఉత్తమ హాస్య నటుడిగా నిశబ్ధమా నీ ఖరీదెంతలో వామనరవు, (కన్నబాబు), ఉత్తమ బాలనటిగా రాత నాటికలో స్వప్నిక, ఉత్తమ సహాయ నటుడిగా కౌసల్యా సుప్రజారామలో సీతారాం (విజయ్), ఉత్తమ సహాయ నటిగా ఇంద్రప్రస్థంలో సౌందర్య పాత్ర జి.నాగ కుసుమసాయి, ఉత్తమ సంగీతం రాతలో సురభి నాగరాజు, ఉత్తమ ఆహార్యం రాతలో శివ ప్రసాద్, ఉత్తమ రంగాలంకరణ ఇంద్రప్రస్థంలో ఫణి, ఉత్తమ రంగోద్దీపనంగా కౌసల్యా సుప్రజా రామ, జ్యూరీ అవార్డులు కొత్త తరం కొడుకు శ్రీరామచంద్రయ్య, డి.ఉమాశంకర్, రైతే రాజులో రైతు వెంకన్న (భుజంగరావు), న్యాయ నిర్ణేతలుగా ఆకుల మల్లేశ్వరరావు, కత్తుల రామ్మోహన్‌రావు, వి.వేణుగోపాల్ వ్యవహరించారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ జయకేతనం


యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు



మూడోస్థానంలో నిలిచిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు

ఏలూరు రూరల్: అంతర జిల్లాల యూత్ బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. విజయవాడలో స్టెల్లా కాలేజ్ ఆవరణలో నాలుగురోజులుగా ఏడో రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న జిల్లా బాలుర జట్టు వరుస విజయాలతో ఫైనల్‌కు చేరింది. శుక్రవారం సాయంత్రం జరిగిన తుదిపోరులో తూర్పు గోదావరి జిల్లా జట్టును ఢీ కొట్టింది. ఫ్లడ్‌లైట్స్ వెలుగుల్లో జరిగిన మ్యాచ్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఆట ప్రారంభమైన మొదట రెండు క్వార్టర్ సమయం 20 నిమషాల్లో జిల్లా బాలురు అద్భుత డిఫెన్స్‌తో పాటు డ్రిబ్లింగ్, పాసింగ్, షూటింగ్‌తో 29–18 స్కోర్ సాధించి ప్రత్యర్థి జట్టుపై పైచేయి సాధించింది. మూడో క్వార్టర్‌లో 48–36 స్కోర్ సాధించి, నాలుగో క్వార్టర్‌లో దూకుడు ప్రదర్శించి 62–51 స్కోర్‌తో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. దీనికి ముందు పోటీల్లో అనంతపురం, కృష్ణ, విశాఖ జట్లను మట్టి కరిపించి ఫైనల్‌కు చేరింది.

మూడోస్థానంలో నిలిచిన బాలికల జట్టు

తృతీయస్థానంలో బాలికలు

మరో పక్క వరుస విజయాలతో దూసుకుపోయిన జిల్లా బాలికల జట్టుకు సెమీ ఫైనల్‌లో బ్రేక్ పడింది. తూర్పుగోదావరి జిల్లా జట్టు చేతిలో 63–52 స్కోర్‌తో ఓటమి పాలై మూడో స్థానంతో సరిపెట్టుకుంది. టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ ప్రదర్శించి జిల్లా ప్రేరు, ప్రఖ్యాతలు తీసుకొచ్చారని ఉమ్మడి పశ్చిమగోదావరి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్, కోశాధికారి కె.మురళీకృష్ణ ఇరుజట్లను అభినందించారు.

వృద్ధురాలి మెడలో ఐదు కాసుల గొలుసు చోరీ

కామవరపుకోట: ఇద్దరు యువకులు దాహం వేస్తుందని, మంచినీళ్లు ఇవ్వమని వృద్ధురాలి మెడలో 5 కాసుల బంగారు గొలుసు అపహరించిన ఘటన చిన్నమ్మరావుపాలెంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని ఆడమిల్లి గ్రామ పంచాయతి చిన్నమ్మారావుపాలెం గ్రామానికి చెందిన కమ్మ తులసమ్మ శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి ఆవరణలో కూర్చుని ఉండగా, ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు వచ్చి ఆ వృద్ధురాలిని మంచినీళ్లు కావాలని అడిగారు. ఆమె లోపలకు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా ఒకడు ఆమె మెడలో నుంచి బంగారం గొలుసు లాగేశాడు, ఆ సమయంలో ఆమె ఆ యువకులను ప్రతిఘటించే ప్రయత్నం చేసినా వారు వృద్ధురాలిని తోసేసి, ద్విచక్ర వాహనంపై దొంగలిద్దరు ఆడమిల్లి మీదుగా కామవరపుకోట వైపు వెళ్లిపోయారు. ఈ సంఘటనపై తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దొంగిలించిన బంగారం విలువ సుమారు రు. 2 లక్షలకు పైనే ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

పాల వ్యాన్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతి

కామవరపుకోట: ఆగి ఉన్న పాలవ్యాన్‌ను వెనక నుండి ఢీ కొట్టి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో గండిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. తడికలపూడి ఎస్సై జయబాబు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం శింగగూడెం గ్రామానికి చెందిన ఉమ్మడి దుర్గారావు (42) గురువారం ఉదయం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరి తడికలపూడి గ్రామపంచాయతీ వేంపాడు బంధువులు ఇంటికి వెళ్లి అదే రాత్రి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా మండలంలోని కళ్ళచెరువు గ్రామ పంచాయతీ గండిగూడెం గ్రామ శివారు వచ్చేసరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న పాల వ్యాన్‌ను వెనుక నుండి ఢీ కొట్టాడు. ఘటనలో దుర్గారావుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడకు అక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై జయబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పోలవరం రూరల్: మండలంలోని ఎల్ఎన్‌డీపేట గ్రామంలో రోడ్డుపై నిలిపి ఉంచిన వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని ఒక యువకుడు మృతిచెందాడు. పోలవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్ఎన్‌డీపేట గ్రామానికి చెందిన కాసాని కిరణ్‌బాబు(35) అనే యువకుడు శుక్రవారం తెల్లవారుజామున ఇంటి వద్ద నుంచి మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా అక్కడే నిలిపిన వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో స్థానికులు 108 వాహనంలో కిరణ్‌బాబును పోలవరం వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు.

క్లుప్తంగా

పీఆర్సీ, డీఆర్ బకాయిలు చెల్లించాలి


విశ్రాంత ఉద్యోగులచే చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్రాంత ఉద్యోగులకు పీఆర్సీలు, డీఆర్ బకాయిలు, అడిషనల్ క్వాంటమ్‌లను చెల్లించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరికుమార్ పేర్కొన్నారు. అసోసియేషన్ భవనం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో ఓటును సద్వినియోగం చేసుకున్నందుకు విశ్రాంత ఉద్యోగులను అభినందించారు. వక్తలు మాట్లాడుతూ పెన్షన్ సకాలంలో ప్రతి నెల చెల్లించాలని కోరారు. వేసవి కాలం సందర్భంగా అసోసియేషన్ కార్యాలయం వద్ద మజ్జిగ చలివేంద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, వై.వి.సత్యనారాయణ, ముస్తాఫా, అర్జునరావు, సూరెడ్డి, కృష్ణకుమారీ తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆర్టీసీ డిపో వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు సందర్భంగా శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేల్పూరులో అన్నసమారాధన

తణుకు టౌన్: మండలంలోని వేల్పూరు గ్రామంలో శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వేల్పూరు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ యడ్లపల్లి ఎను, ఆలయ కమిటీ సభ్యులు, ఈవో పీ సూర్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులతో పాటు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన దానేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవాలు


దువ్వ దానేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద చండీ హోమం దృశ్యం

తణుకు టౌన్: తణుకు మండలం దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఆలయ ఆవరణలో చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో అమ్మవారికి మహా కుంభం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుంచనపల్లి ఆలయానికి విరాళం


శ్రీవారి ఆలయానికి విరాళం అందజేస్తున్న నున్నా బాలత్రిపుర సుందరరావు దంపతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీదేవీ, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన నున్నా బాలాత్రిపుర సుందరరావు – నాగలక్ష్మి దంపతులు రూ.10,116లను శుక్రవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటి, ట్రస్ట్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జోరు వానతో రైతులకు ఇక్కట్లు

యలమంచిలి: అకస్మాత్తుగా శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు సేద తీరారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో వర్షం సాధారణ ప్రజలకు ఉపశమనం కలిగించినా రైతులకు మాత్రం గుండెల్లో రైళ్లు పరిగెట్టించింది. యంత్రాలతో వరి పంట కోసిన రైతులు ధాన్యంలో తేమ శాతం తగ్గించడానికి రాశుల్లో ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఒక్కసారిగా మబ్బులు కమ్మడంతో రైతులంతా అప్రమత్తమై ధాన్యంపై బరకాలు కప్పారు. మామిడి రైతులు కూడా ఆందోళన చెందారు. ఈదురు గాలికి మామిడికాయలు రాలాయి. మట్టి పని చేస్తున్న వారికి కూడా వర్షం అంతరాయాన్ని కలిగించింది.

పేదింట చదువుల విప్లవం

- నాడు – నేడు నిధులతో విరాజిల్లుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- సర్కారు పాఠశాలల్లో పెరిగిన హాజరు శాతం
- పది ఫలితాల్లో కార్పొరేట్ దీటుగా విద్యార్థులకు మార్కులు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు


తణుకులో రూ. 3.50 కోట్లు నాడు నేడు నిధులతో తీర్చిదిద్దిన జెడ్పీ బాయ్స్ హైస్కూల్ (ఫైల్)


తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో విద్యార్థినులకు ఐఎఫ్‌బీ స్మార్ట్ స్క్రీన్ ద్వారా బోధన చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

తణుకు అర్బన్: భావితరాలను విద్యావంతులు చేయడం ద్వారానే సమాజ అభివృద్ధి చెందుతుందనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ చదువు అనే సంపద అందించే క్రమంలో పేదింటి పిల్లల కోసం విద్యావిప్లవాన్ని తీసుకువచ్చారు. పేదింటి బిడ్డలంతా విద్యనభ్యసించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యాంశాల బోధన మరింత సులువు చేసే క్రమంలో ప్రభుత్వం నూతన విధానాలను, వాటికి సంబంధించిన మౌలిక వసతులను పాఠశాలలకు కల్పించింది. పిల్లలను పాఠశాలలకు పంపిస్తే సంక్షేమం అందిస్తామని చెప్పి అమలు చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడమే కాకుండా ఈ ఏడాది పది పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్కులు సాధించి సత్తా చాటారు.

మార్పు తీసుకువచ్చిన సంక్షేమం

పేదింటి బిడ్డల విద్యాభ్యాసానికి ప్రభుత్వం అందించిన సంక్షేమం ఎంతో మార్పు తీసుకువచ్చింది. విద్యార్థిని బడికి పంపిస్తే అమ్మ ఒడి ద్వారా ఏడాదికి రూ. 15వేలు ఇస్తామని చెప్పి అమలు చేయడాన్ని తల్లి తండ్రులు హర్షిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల సౌకర్యార్థం విద్యాకానుక పేరుతో పాఠ్యాంశ పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగ్, టై, షూస్, యూనిఫామ్ వంటి సౌకర్యాలను జగన్ ప్రభుత్వం అందచేసింది. బిడ్డల చదువు తల్లితండ్రులపై ఒత్తిడి పడకుండా అమ్మ ఒడి, గోరు ముద్దతో ప్రభుత్వం ఆదుకుంది.

వసతుల వెల్లువ..

నాడు– నేడు నిధులతో తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలను రూపురేఖలు మార్చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ప్యూరిఫైడ్ తాగునీరు, అధునాతన సౌకర్యాలతో టాయిలెట్స్, భవన, ప్రహరీ నిర్మాణాలు, తరగతి గదుల్లో అధునాతనమైన బెంచ్‌లు, డెస్కులు, లంచ్ రూంలు వంటివి విద్యార్థుల తోపాటు తల్లి తండ్రులు కూడా స్వాగతించారు. ముఖ్యంగా ఇంగ్లీషు మీడియం బోధన, ప్రైవేటు పాఠశాలల్లో సైతం లేని డిజిటల్ సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా విద్యావిధానంలో విద్యార్థులకు డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి అభ్యసన సామర్థ్యన్ని మెరుగుపరిచేందుకు ఇంట్రాక్షన్ ఫ్లాట్ పానల్ (ఐఎఫ్‌పి) స్మార్ట్ స్క్రీన్‌లు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ స్మార్ట్ స్క్రీన్‌ల ద్వారా అంతర్జాలంలో పొందుపరిచి ఉన్న వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలను ఉపాధ్యాయులు సులువుగా అర్థమయ్యే రీతిలో ప్రయోగాత్మకంగా విద్యార్థులకు బోధిస్తున్నారు. వీటిని మొబైల్ ద్వారా యాక్టివేట్ చేయడం, పెన్‌డ్రైవ్‌లు, ఇంటర్నెట్ ద్వారా మూడు పద్ధతుల్లో వినియోగింపచేశారు. అంతేకాకుండా 8వ తరగతి విద్యార్థులందరికీ ప్రభుత్వం ఉచితంగా ట్యాబ్‌లు అందచేసింది. ఇలా కార్పొరేట్ పాఠశాలల్లో లేని విద్యా సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యక్షమవ్వడంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగపరచుకున్నారు.

మెరుగైన పది ఫలితాల శాతం

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గంలో ఈ ఏడాది పది పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 72 శాతంతో ఉత్తీర్ణులయ్యారు. ముఖ్యంగా ఇంగ్లీషు మీడియంలో 82 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, తెలుగు మీడియంలో 57 శాతం ఉత్తీర్ణత సాధించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్తిలి హైస్కూల్ విద్యార్థి సీహెచ్ రేవంత్ కుమార్ 590 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించగా, అత్తిలి గరల్స్ హైస్కూలు విద్యార్థిని ఎస్‌వీఎస్ఎస్ త్రివేణి 582 మార్కులు, తణుకు జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కేఎస్ కార్తికేయని 581 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటారు.

పేదల విద్యకు అధిక ప్రాధాన్యం



పేదల విద్య ద్వారా ఆ కుటుంబాలను అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. అంతేకాకుండా పిల్లలను పాఠశాలలకు పంపిస్తే తల్లి తండ్రులకు లంచం ఇచ్చినట్లుగా సంక్షేమాన్ని అందించారు. గతంలో నోటు పుస్తకాలు, బ్యాగ్‌లు ఇతరత్రా ఖర్చులు తల్లి తండ్రులకు అయ్యేవి. కానీ నేడు అన్ని ఉచితం చేయడమే కాకుండా 1వ తరగతి విద్యార్థి నుంచి అమ్మ ఒడి ద్వారా రూ. 15వేలు అందజేశారు.

– డీజే అమూల్యారావు, రిటైర్డు ఉపాధ్యాయులు, తణుకు

పేదింటి పిల్లలను బడిబాట పట్టించారు



గతంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన పిల్లలు మాత్రమే విద్యకు అర్హులన్నట్లుగా పరిస్థితి ఉండేది. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడగానే ప్రభుత్వ పాఠశాలల తీరుతెన్నులు మార్చేశారు. పేదల పిల్లలందరూ కుల వృత్తిలోనో, కార్మికులుగానో మిగిలిపోకూడదనే ఉద్దేశ్యంతో అమ్మ ఒడి ద్వారా తల్లి తండ్రులకు ఊతమిచ్చి విద్యకు అవసరమైన సామాగ్రి, సౌకర్యాలు ఉచితం చేశారు. దీంతో పేదింటి పిల్లలంతా బడిబాట పట్టారు.

– ఎస్‌వీ జాకబ్‌బాబు, విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు, తణుకు

చురుగ్గా నాలుగు లైన్ల విస్తరణ పనులు


వెంకట్రామన్నగూడెం చెరువు వద్ద తాడిపూడి కాలువపై బ్రిడ్జి విస్తరణ పనులు జరుగుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలోని హౌసింగ్ బోర్డు నుంచి వెంకట్రామన్నగూడెం చెరువు వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం గతంలోనే పూర్తయిన విషయం పాఠకులకు విదితమే. ప్రస్తుతం వెంకట్రామన్నగూడెం చెరువు నుంచి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వరకు ఉన్న రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగానే తాడిపూడి కాలువపై వంతెన విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి అయితే తాడేపల్లిగూడెం పట్టణం నుంచి వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు పూర్తి స్థాయిలో నాలుగు లైన్ల రహదారి అందుబాటులోకి రానున్నది. దీంతో ఎంతో కాలంగా ఉన్న ప్రయాణీకుల అవస్థలు తొలగనున్నాయి.

ముగిసిన చెన్నకేశవుని కల్యాణోత్సవాలు

ఉండి: ఉప్పులూరులో చుడికుద్దా నాంచియార్,అండాళ్ సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చెన్నకేశవస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ యర్రా సుబ్బారావు తెలిపారు.అన్నసమారాధనకు గ్రామంలోని భక్తులతో పాటుగా పాములపర్రు, కోలమూరు, ఆరేడు, కలిగొట్ల, పాందువ్వ, ఉణుదుర్రు, యండగండి, గణపవరం, సరిపల్లె తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నట్లు తెలిపారు.

అజాగ్రత్తే ఆరోగ్యానికి హానికరం


తణుకులో దోమల వ్యాప్తిపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తణుకు వెక్టార్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఎన్‌జీవో కాలనీ, ఇంద్రయ్య నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా వాతావరణం మారుతున్న నేపథ్యంలో లో డెంగీ వ్యాధికి అడ్డుకట్ట వేయాలంటే దోమల వ్యాప్తిని అరికట్టాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా అత్యంత ప్రమాదకరంగా మారుతున్న డెంగీ వ్యాధి కారణమైన టైగర్ దోమను నిరోధించాలంటే వారానికోసారి డ్రైడేగా పాటించి ఇంటి పరిసరాలను సంపూర్ణంగా శుభ్రం చేసుకోవాలని కోరారు. దోమలు నిల్వ ఉండే ప్రాంతాలను గమనించి అప్రమత్తంగా ఉండాలని, డెంగీ దోమ మురికినీటిలో ఉండదని ఫ్రెష్ వాటర్‌లో మాత్రమే పెరుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దోమ పెట్టే గుడ్డు దోమగా మారేందుకు 8 నుంచి 10రోజులు సమయం పడుతుందని ఈ లోపు గుడ్డు దశలోనే నివారిస్తే దోమ ప్రబలే అవకాశం ఉండదన్నారు. మన అజాగ్రత్తే మన ఆరోగ్యానికి హాని చేస్తుందనే విషయాన్ని ప్రజలు మననం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు పద్మజ, వి.రాజకుమారి, మహిళారోగ్య పర్యవేక్షకులు రత్నా భాయ్, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని, అలాగే ప్రతి శుక్రవారం ఫ్రై డే, డ్రై డే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు కడకట్ల, వీకర్స్‌కాలనీ పరిధిలో 3, 5, 29, 30లలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, ఆరోగ్య సర్వేలు, వెక్టార్ కంట్రోల్ హైజీన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలనలు శుక్రవారం పలు ప్రాంతాలలో చేశారు. వార్డులో ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, సిబ్బందికి పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. క్లస్టర్ స్థాయిలో సిబ్బంది నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలు, అపరిశుభ్రత ప్రాంతాలను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ముందస్తు కీటక నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు బేబీ, సుష్మా, సరళ, ఆశాలు పాల్గొన్నారు.

స్కిజోఫ్రెనియా వ్యాధిపై అవగాహన సదస్సు


అత్తిలి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ ధనలక్ష్మి

అత్తిలి: మెదడులో ఉత్పత్తి కావలసిన డోపమిన్, గ్లూటమిట్, సెరిటనిన్ అనే రసాయనాలు లోపం వల్ల స్కిజోఫ్రెనియా వ్యాధి వస్తుందని జిల్లా నాన్ కమ్యూనికేబుల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ధనలక్ష్మి అన్నారు. ప్రపంచ స్కిజోఫ్రెనియా డే పై శుక్రవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి, ర్యాలీ జరిపారు. ఈసందర్భంగా డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ స్కిజోఫ్రెనియా(పిచ్చి)వ్యాధి దీర్ఘకాలిక వ్యాధి అని, ఇది జన్యుపరంగా వస్తుందన్నారు. తల్లి లేదా తండ్రికి ఈవ్యాధి ఉన్నట్లయితే వ్యాధి సంతానానికి వచ్చే అవకాశం ఉందన్నారు. మనుషులు ఎవరూ కనిపించకుండా చెవిలో మాటలు వినిపించడం, తనను ఎవరో ఏదో చేయమని చెప్పడం, సంబంధం లేని మాటలు మాట్లాడటం, ఏకాగ్రతలేకపోవడం ఈవ్యాధి లక్షణాలుగా చెప్పుకోవచ్చన్నారు. వీరికి సైకో సోషల్ ట్రైనింగ్, కౌన్సిలింగ్, ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఇస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు, సైకాలజిస్ట్ శ్రీనివాసు, సైకియాట్రి నర్స్ డి స్వర్ణకుమారి, సోషల్ వర్కర్ స్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ జి ప్రమీలాదేవి, హెల్త్ విజిటర్ జి అమ్మాజీ పాల్గొన్నారు.

వినోదపు పన్ను వసూలులో అలసత్వం


నరసాపురం మునిసిపల్ కార్యాలయం

నరసాపురం: వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో నరసాపురం మునిసిపాలిటీలో నష్టం జరుగుతోంది. కనీస మాత్రంగా కూడా వినోదం, ప్రకటనలకు సంబంధించి పన్నులు రావడంలేదు. ఏటా వచ్చే నామమాత్రపు ఆదాయం కూడా, ఏళ్ల తరబడి వసూలు కాకుండా, మొండి బకాయిగా మిగిలిపోతోంది. వినోదం పన్ను రూపంలో మునిసిపాలిటీకి ఏడాదికి రూ.4 లక్షలు వసూలు అవుతుంది. ఇక ప్రకటనల పన్ను అయితే రూ.1.23 లక్షలు. మొత్తంగా రూ.5.23 లక్షలు పన్నుల రూపంలో రావాల్సి ఉంది. ఏడాదికి మునిసిపాలిటీకి ఆస్తి, కుళాయిలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర రూపాల్లో రూ.2.75 కోట్లు ఆదాయం వస్తోంది. ఇందులో వినోదం, ప్రకటనల పన్నుల వాటా నామమాత్రంగా ఉంటోంది. వినోదం పన్నులు రూ.10 లక్షలు, వరకూ, ప్రకటనల పన్నులు రూ.3 లక్షల వరకూ బకాయిలున్నాయి. వినోద పన్నుల వసూలుకు నిబంధనల ప్రకారం ఇతర మార్గాలున్నా అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఇటీవల ఎక్కడ పడితే అక్కడ ప్రకటనల హోర్డింగ్స్, ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. వీటి నుంచి కూడా పన్నులు వసూలు చేయడంలేదు. ఆదాయం వచ్చే మార్గాల్లో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తూ అధికారులు మునిసిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో ఉన్న లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టాలనే ప్రజలు కోరుతున్నారు.

పడాలలో ముగిసిన సువార్త సభలు

పెంటపాడు: దేవుని ఆధ్యాత్మిక జ్ఞానాన్ని క్రైస్తవులు పూర్తిగా అలవరచుకోవాలని విశాఖపట్నంకు చెందిన దైవసేవకులు శామ్యూల్ కర్నోజీ పేర్కొన్నారు. పడాల వాక్యజ్యోతి మినిస్ట్రీస్ వ్యవస్థాపకురాలు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ ఆధ్వర్యంలో పడాల మార్కెట్ యార్డు సమీపంలో బేతిరెడ్డి అమ్మిరెడ్డి స్థలంలో జరుగుతున్న క్రీస్తు సంపూర్ణసువార్త సభలు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వాక్యజ్యోతి సంస్థ ఆధ్వర్యంలో యువత ప్రత్యేక గీతాలు ఆలపించారు. వాక్యజ్యోతి సంఘ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ల సంఘ అధ్యక్షుడు కె. జాజిరాజు, సేవకులు కొమ్మిశెట్టి ఘనరాజు ప్రత్యేకంగా దేవుని వాక్యం బోధించారు. గాయకులు శిరివెళ్ల హనోక్ తదితరులు కీర్తనలు ఆలపించారు. గూడెం, పెంటపాడు, ఉంగుటూరు మండలాలకు చెందిన విశ్వాసులు బ్రదర్ సత్యకృప, బ్రదర్ నవీన్ కుమార్, పలు సంఘాలకు చెందిన క్రైస్తవ మత ప్రబోధకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు, రేపు అలంపురంలో ఉచిత కంటిపరీక్షలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణ సేవా ట్రస్టు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 25,26 తేదీల్లో ఉచిత కంటి వైద్యపరీక్షలు చేయనున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ కంటి వైద్యులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు రాయితీపై అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కాగా, తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ఏడు స్కూల్స్ జెడ్పీ ఉన్నత పాఠశాల, కడకట్ల మునిసిపల్ హైస్కూల్, సుబ్బారావుపేట మునిసిపల్ హైస్కూల్, కింబర్లీ, మాంటిస్సోరి, సెంట్ జోన్స్, భాష్యం స్కూల్‌లో జరిగాయి. 458 మంది విద్యార్థులకు గాను 141 మంది పరీక్షలకు హాజరయ్యారు. 317 మంది పరీక్షలకు హాజరుకాలేదు.

తీర ప్రాంత గ్రామాల్లో పంట బోదెల తవ్వకం

మొగల్తూరు: తీర ప్రాంత గ్రామాలైన కేపీపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో పంట బోదె తవ్వకాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. వ్యవసాయ పనులు పూర్తికావడంతో పాటు కేపీపాలెం మంచి నీటి చెరువును పూర్తిస్థాయిలో నింపారు. ఇక ఉన్న నీటిని కొబ్బరి, సరుగుడు, మామిడి తోటలకు పూర్తిస్థాయిలో నీరు అందేలా పంట బోదెలు తవ్వకాలు చేపట్టారు. శుక్రవారం కేపీపాలెం సౌత్ గ్రామంలోని ప్రధాన పంట బోదెలో గుర్రపు డెక్క, మట్టి మేటలు వేయడంతో వాటిని తొలగించేందుకు పంట బోదె తవ్వకాలు చేపట్టారు.

అధిక ఫీజు వసూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


తణుకులో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తణుకు: కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలలో భారీగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలుపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణరాజుకు సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఇష్టానుసారం పెంచుకొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం లేదా అధికారులు పట్టించుకోకపోవడం వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నప్పటికి టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి మాత్రం చట్ట ప్రకారం వేతనాలు లేకపోవడం బాధాకరం అన్నారు. ఫీజులు నియంత్రణ కోసం సీపీఎం నిర్వహిస్తున్న ఈ పోరాటానికి అందరూ మద్దతు ఇవ్వాలని ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గార రంగారావు, చిట్టూరి రంగారావు, సీహెచ్ రామకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


డీఆర్ గోయెంకా కళాశాలలో మొక్కలు నాటుతున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పర్యవరణాన్ని పరిరక్షణకు కృషి చేయాలని జమ్ముకాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్న శివ కరణ్ పేర్కొన్నారు. భారత్ పర్యటనలో భాగంగా శుక్రవారం స్థానిక డీఆర్ గోయంక మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మొక్కలు నాటారు. శివకరణ్ మాట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నేల, నీరు అందే విధంగా ప్లాస్టిక్ నిషేధించాలని, మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణాన్ని కాపాడి భావితరాలకి అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ముప్పిడి సురేష్ రెడ్డి, రామగాని సత్యనారాయణ, బోగిరెడ్డి ఆదిలక్ష్మి, కుమారి, నవీన్, రమేష్, శంకరమఠం నిర్వాహకులు రామం, కళాశాల ప్రిన్సిపాల్ గణపతిరామ్, జీఎంఆర్ విద్యా సంస్థల అధిపతి గ్రంధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల వితరణ


కనకదుర్గమ్మ ఆలయం వద్ద సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసిన కాపు వనిత క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని పాదచారులు, ప్రయాణీకులు, భక్తులు కూర్చోవడానికి అనుకూలంగా ఉండాలనే ఉద్దేశంతో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసినట్లు యునైటెడ్ కాపు వనిత సర్వీస్ క్లబ్ అధ్యక్షురాలు మంగెన అరుణ తెలిపారు. శుక్రవారం పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయం పూలపల్లి బైపాస్ రోడ్డు వద్ద ప్రయాణీకుల కోసం, కెనాల్ రోడ్డు కనకదుర్గమ్మ ఆలయం వద్ద భక్తుల కోసం, గాంధీబొమ్మల సెంటర్ వద్ద పాదచారుల కోసం దాతల సహకారంతో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. అరుణ మాట్లాడుతూ వనిత క్లబ్ ద్వారా బల్లలు ఏర్పాటుకు దాతలు డాక్టర్ ముచ్చర్ల సంజయ్, కొండ్రెడ్డి సూరిబాబు తమ సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కాపు క్లబ్ గవర్నర్, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, జక్కంపూడి కుమార్, పెనుమాక రామ్మోహన్, జక్కంపూడి మధన్, మంగెన సాయి, వనిత క్లబ్ సభ్యురాళ్లు శిద్దిరెడ్డి శైలజ, డాక్టర్ కావలి మౌని, రావి సృజన, నారిన సూర్యకుమారి, దేవరపు కాంచన మాల, ముళ్లపూడి లావణ్య, బంగారం మణి, గుండుమోగుల భారతి తదితరులు పాల్గొన్నారు.

26న ఏబీఎస్‌వీకే ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటే వారి తోటలోని సుందరయ్య భవనం లో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బిపి, సుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన వైద్యులు డి .సందీప్ వర్మ, జి. పద్మజ, జి.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొని వైద్య సేవలు అందజేస్తారన్నారు.